# అప్పగింతలు

(అమ్మాయిని ఏ వూరిచ్చారు, చిలకలపల్లేనా?
లేదమ్మా, సిలికాన్ వాలీలో పడేశాం ఇరుకుగదులు, మురికివాడల సొద తప్పుతుందని)

అక్కడ చలి తక్కువ, ఖర్చుల్ తక్కువ
ఆదాయాలెక్కువ,
సుఖ శాంతులకి మరి కొదవే లేదు.
అల్లుడు బ్రెయిన్ సర్జనవుతాడో
రగ్ డాక్టరవుతాడో ఇంకా తెలీదు మరి
కాని అక్కడి సౌఖ్యాలు మాత్రం ఎనలేనివి.
అందుకే మా చిట్టితల్లికి బోధ చేశాను,
ఎంచక్కా
నలగని దుస్తులు
చెరగని క్రాపులు
ఒంటికి అలుపు లేని పనితో
కాలం కరిగిపోతుంది,
రోజుకి ఇరవైనాలుగ్గంటలు చాలవు
అనుభవించడానికి.
వాషర్లూ, డ్రైయర్లూ
ఏక్ మినిట్-పంటకాలు, టీవీ డిన్నర్లు,
ఆ పైన హోటళ్లూ, సినిమాలూ, డీవీడీలూ,
వారం వారం పార్టీలు,
అబ్బే, వండక్కర్లేదమ్మా, అంతా కేటరింగే.
అంతకన్నా ఏ కన్నెపిల్ల మాత్రం ఏం కోరుకుంటుంది?
అత్తా ఆడబడుచుల పోరుండదు హాయిగా.
అతనొక్కడే చాలు అందరిపెట్టు -లాటి మాటలనకు
అతడు నొచ్చుకోగలడు.

అల్లుడు చదువుకున్నవాడే
మంచీ చెడ్డా మాటాడుతూ ఊఊఊఊఊఊ … …
వుంటాడు రోజంతా.
అతిథులు వచ్చినప్పుడు
గరిట పుచ్చుకు నిలబడతాడు
విద్యుత్ పొయ్యి ముందు విలాసంగా
కేవలం నీ పరువు నిలబెట్టడానికే
చూడచక్కని సుందరదృశ్యమది!
అమర్చినదానిలో అత్తగారు వేలు పెట్టినట్టు లాటి
సామెతలు వాడకు
అతడిమనసు బాధ పడుతుంది.

ప్లేను దిగ్గానే
కారు కొనిచ్చేస్తాడు.
హాయిగా తిరగొచ్చు
అతడిని ఆఫీసులోనూ
పిల్లల్ని స్కూళ్లలూనూ
దిగడిచేసి.
అలా తిరుగుతున్నప్పుడే
ఇంటిక్కావలసిన కూరా కాయా
ఉప్పూ పప్పూ
తెచ్చేసుకోవచ్చు,
చూడవచ్చిన చుట్టాల్నీ పక్కాల్నీ
బజార్లంట తిప్పొచ్చు.
అలా తిరగడానికి
ఓపిక లేదంటూ నస పెట్టకు
తప్పు తల్లీ, అది మర్యాద కాదు.

మునిమాపు వేళ
ముఖాన రవంత చిర్నవ్వు మేకప్పేసుకుని

కనిపిస్తే చాలు, పరమానందపడిపోతాడు.
సంసారం సాఫీగా తారురోడ్డుమీద కాడిలాక్‌లా తూగిపోగలదు.

అవున్నిజమే,
మనూళ్లోమల్లె పుట్టింటికి పోతానంటూ
ఎక్కి వచ్చేయడానికి
ఆర్టీసీ బస్సో హౌరా ఎక్స్‌ప్రెసో దొరకదు.
మనవాళ్లుంటారు కాని
మనసిప్పి మాటాడుకోడానికి వీలవదు.

అంతమాత్రాన
నువ్వు బాధ పడుట తగదు సుమా.
కావలిస్తే అర్ధరాత్రి నిద్ర పట్టనప్పుడు
లేచి కూచుని కథలో కవితలో రాసుకో.
నీ నాథుడు అభ్యంతరం చెప్పడు.
నీ రచనల అశోకవృక్షానికి దోహదక్రియ
సలుపగల ధీరోదాత్త నాయకుడతడు.
మనసాహిత్యచరిత్రనిండా చచ్చినన్ని సాక్ష్యాలున్నాయి
ఈవాదనకి.
ఆనక చూపుతా అవసరమయితే.

లే తల్లీ,
మానుకో నీ మనోయాది
తుడుచుకో కన్నీరు
ముడుచుకో విరులు
ఎగిరిపో వియత్పథాన,
వేయి కనుల వేచియున్న
ఆ పరమ పురుషుని కడకు.

(నిడదవోలు మాలతి, నవంబరు 2004)